

డా!! రవికృష్ణ ప్రొఫెషన్‌లో అంతగా రాణించలేకపోయాడ. అయితే తండ్రి సంపాదించి పెట్టిన ఆస్తి ఉండడంతో అతనికి ఆదాయం గురించి అంత ఆందోళన లేదు.

అతనికి సాహిత్యంలో కొంత ప్రవేశముంది. అందుకే రచనలవైపు దృష్టి సారించాడు. అడపాదడపా అతని కథలు పబ్లిష్ అవుతుండేవి. ఒకే అభిరుచి ఉన్నవారు మిత్రులు కాగలరు. అన్నట్లు అతనికి విశ్వం, అనిల్, జితేంద్రలతో పరిచయమయింది. వాళ్లకు కూడా సాహిత్యం మీద అభిరుచి ఉంది. వాళ్లకూడా కలంపట్టిన వాళ్లే! అప్పుడప్పుడూ అచ్చులో పేరు చూసుకుంటుంటారు.

విశ్వం లాయరైతే, అనిల్ బ్యాంకాఫీసర్. జితేంద్ర కలెక్టరాఫీస్‌లో స్టెనో. అందరిదే ఇకే ఊరుకాబట్టి ప్రతి ఆదివారం సాయంత్రం రవికృష్ణ ఇంట్లో సమావేశయ్యేవారు. ఆరోజు రవికృష్ణ పేషెంట్లకు అటెండయ్యే వాడుకాదు.

నలుగురూ కలసి పాతసాహిత్యాన్ని, ఆధునిక కథనరీతులతో సరిపోల్చే వారుజ వ్రాసిన కథలగురించి, తిరిగొచ్చిన కథల గురించి చర్చించేవారు. వీక్లీల గురించి, కథల పరిశీలనలో జరుగుతున్న ఆలస్యాన్ని గురించి మాట్లాడుకునేవారు.

# లోపం

ఎస్. శివనాగేశ్వర రావు

మొదట్లో కాఫీ, టీలతో మొదలైన వాళ్లసమావేశాలు క్రమేపీ బీర్ తాగుతూ మాట్లాడుకునే స్థాయికి పెరిగాయి.

గురజాడ... దువూతరి... తిలక్.. బుచ్చిబాబు .. ప్రేమ్‌చంద్‌లతో మొదలు పెట్టి ఓహెన్రీ ఆర్థర్ హెయిలీ, సోమర్ సెట్ మామ్‌వరకూ వెళ్లేవారు.

వాళ్ల చర్చలు ఎలా ఉండేవంటే ప్రతివారు తాము రాసిన కథల గురించి చెప్పేవారు. వాటి గురించి విమర్చించుకునేవారు. చివరికి అంత మంచి కథ ఇటీవలి కాలంలో ఏ రచయితా రాయలేదని తీర్మానించేవారు. ఆకథరాసిన రచయితను మిగిలిన ముగ్గురూ అభినందించే వారు. ఆ తరువాత సంభాషణ, అంతమంచి కథను తిప్పి కొట్టిన ఎడిటర్ వైపు మరలేది.

నలుగురూ కలసికట్టుగా, పత్రికల్లో కథలు అచ్చవడానికి రికమెండేషన్స్ ఎక్కువై పోయాయని నిర్ధారణ చేసేవారు. అసలు తామే ఒక పత్రిక స్థాపిస్తే ఎలా ఉంటుందా! అని ఆలోచన జేసేవారు. కొంచెం సేపటితరువాత, అచ్చవని తమ కథలను తామే ఒక సంకలనంగా తీసుకురావాలని డిస్కస్ జేసేవారు. వేయికాపీల ముద్రణకు ఏం ఖర్చువు తుందో లెక్కలు వేసేవారు.

కథలు ప్రచురించబడడానికి ఎటువంటి టెక్నిక్స్ అవలంబించాలో ఒకరికొకరు చెప్పుకునేవారు. అలా పంపినా కథలు తిరిగొచ్చేవి.

పొరపాటున ఎప్పుడైనా వాళ్లలో ఎవరిదైనా కథ ప్రచురణకు నోచుకుంటే ఆ ఆదివారం సందడి మరింత ఎక్కువగా ఉండేది. బీర్స్‌కు, సిగరెట్లకు అయ్యే ఖర్చు కథ రాసిన వ్యక్తి భరించవలసి

వచ్చేది. అయినా అది వారికి ఆనందంగా ఉండేది. రవికృష్ణ క్లినిక్‌లో ఓ నూనూగుమీసాల కుర్రాడు పని చేసేవాడు. అతని పేరు వంశీ. పేషెంట్లను వరుసలో డాక్టర్ దగ్గరకు పంపడం, ఆయన రాసిన మందులు ఎలా వాడాలో వివరించడం వంటి పనులు చేసేవాడు. ఆదివారం పూట రచయిత మిత్రుల సమావేశానికి వంశీ అవసరం ఎంతో ఉండేది.

బీర్ బాటిల్స్ తేవడం, ఓపిక చేసి గ్లాసుల్లో పోయడం, ఐస్ క్యూబ్స్ వేయడం వంటివి అతను చేసేవాడు. వంశీలో అందరికీ నచ్చేది అతని వినయం. రచయిత మిత్రుల వంశీ మీద జోకులు విసిరేవారు. వంశీ వారి వద్దే నిలబడి అందరి సంభాషణ వినేవాడు. వాళ్ల మధ్య మధ్యలో 'మేం మాట్లాడేదంతా సాహిత్యం. నీకు అర్థమవుతున్నదా?' అని జోకులు విసిరేవారు. ప్రతిగా వంశీ నవ్వేవాడు.

వాళ్లందరికీ తెలుగు రచయితల మీద చాలా చవకబారు అభిప్రాయం ఉండేది. అందుకే ఎప్పుడూ ఆంగ్ల రచయితల నవలల గురించి మాట్లాడేవారు. ఆ స్థాయికి తెలుగు రచయితలు ఎదగలేరని నిర్ణయించేవారు.

ఆ ఆదివారం రచయిత రుద్రుల సంభాషణ ప్రముఖ తెలుగు వారపత్రిక 'కొత్త వెలుగు' నిర్వహిస్తున్న కథల పోటీ వైపు మరలింది. మొదటి బహుమతి కథకు పారితోషికం అయిదువేలు. ఈసారి ఎలాగైనా ఆ బహుమతి తమలో ఎవరో ఒకరు సంపాదించాలని అభిప్రాయపడ్డారు.

మన కథ వస్తువును అర్థం చేసుకునేపాటి మేథస్సు న్యాయనిర్ణేతలకు ఉండదని డిక్లేర్ చేశాడు జితేంద్ర. 'అది నిజమే! అయినా ప్రయత్నం చేద్దామని' మిగిలిన వాళ్లన్నారు. తరువాత సంభాషణ ఎటువంటి ఇతివృత్తాన్ని ఎంపిక చేసుకోవాలన్న దాని మీద జరిగింది. సెక్స్... వయొలెన్స్... సెంటిమెంట్... కామెడీ వంటి అంశాలనన్నింటిని వాళ్లు చర్చించారు. వంశీ వాళ్ల అవసరాలను గమనించి అవసరమైనవి అందజేస్తున్నాడు.

మూడు మాసాల అనంతరం కొత్త వెలుగు పత్రిక కథలపోటీ ఫలితాలు ప్రకటించింది. వీళ్లకే తమపేర్లకోసం నలుగురు రచయితమిత్రులు ఉద్వేగంతో చూశేరు.

వాళ్లపేర్లులేవు. అందుకు వాళ్లు అట్టే చింతించలేదు. అయితే మొదటి బహుమతి గెలుపొందిన రచయిత పేరు చూసి ఖంగుతిన్నారు. 'వంశీ కేరాఫ్ డాక్టర్ రవికృష్ణ' అనిఉంది.

విజేతెవరో కాదు. ప్రతి ఆదివారం వాళ్లకు బీరుగ్లాసులు అందిస్తూ వాళ్ల అవసరాలు చూసే వంశీ. డాక్టర్ రవికృష్ణ క్లినిక్‌లో పనిచేసే కుర్రాడు.

ఆరోజు ఆదివారం కాకపోయినా నలుగురు మిత్రులు డాక్టర్ రవికృష్ణ క్లినిక్‌లో సమావేశం అయ్యారు. ఆరోజు వంశీ డ్యూటీకి అటెండ్‌కాలేదు. తమవంటి మేధావులకు రాకుండా మొదటి బహుమతి అటువంటి బచ్చాగాడికెలా వచ్చిందా? అని నలుగురు వాపోయారు. బహుమతి తమకు రాకపోయినా దానికంటే, వంశీకి రావడం వాళ్లకు బాధాకరంగా ఉంది. డాక్టర్ రవికృష్ణ అప్పటికప్పుడు వంశీకి రమ్మని కబురుపంపాడు.

వంశీ రాగానే నలుగురు రచయిత మిత్రులు ముఖాలకు నవ్వు పులుముకొని అతన్ని అభినందించారు. తరువాత "మొదటి బహుమతి ఎలా సంపాదించావో చెప్పు" అని ఆసక్తిగా ప్రశ్నించారు.

అప్పుడు వంశీ " సర్! నేను మీ అంతటి చదువులు చదవలేదు. మీ అంతటి గొప్పవాన్ని కాను. నాకు తెలిసినదేదో రాశాను. తెలియనిది, తెలిసినట్లు రాయడానికి ఎంతమాత్రమూ ప్రయత్నించలేదు. అదేనా సక్సెస్‌కి కారణం " అన్నాడు.

తమలోపం గ్రహించిన రచయిత మిత్రులు మౌనం వహించారు. ●

